విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

శుక్రవారం 15, డిసెంబరు 2023 4 పేజీలు

పునరుత్పాదక ఇంధన వనరుల వివరాలివ్వండి - తిరుపతిఎంపీ గురుమూర్తి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : వాతావరణంలో మార్పులకు అనుగుణంగా దేశంలో పునరుత్పాదక ఇంధన వనరులు అభివృద్ధి చేయాలి ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న ఇంధన వినియోగ అంశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రం గాల్లో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం పెరిగేలా చూడాలన్న లక్ష్యంతో పార్లమెంటులో ఎంపీ మద్దిల గురుమూర్తి గురువారం ప్రశ్నను సంధించారు. పునరుత్పాదక ఇంధన వనరులలో సముద్రపు అలల శక్తి ద్వారా ఇంధన తయారీని ఒకటిగా కేంద్ర ప్రభుత్వం పరిగణన లోకి తీసుకొందా, అలాగే దేశంలో ఏవైనా అదనపు అనుకూల పునరుత్పాదక ఇంధన వనరులు గుర్తించ బడినవా లేదా అభివృద్ధి చేయ బడినవా అలా అయితే దాని వివరాలు కాకపోతే దానికి గల కారణాలు తెలుప గలరు అంటూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్నించారు. అందుకు సమాధానంగా కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి ఆర్.కె.సింగ్ సమాధానమిస్తూ పునరుత్పాదక ఇంధన వనరులలో టైడల్ ఎనర్జీ ఒకటిగా గుర్తించబడినది అని చెబుతూ, టైడల్ ఎనర్జీ అనేది సముద్రంలోని అలల ఆటుపోట్లని ఉపయోగించి వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయో గించి టైడల్ ఎనర్జీని విద్యుత్తుగా మార్చవచ్చని మరియు ఇది ఊహించిన స్థిరమైన

2లో

తుఫాన్ నష్టాలను పరిశీలించిన కేంద్ర బృందం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:జిల్లాలో తుఫాన్ నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం విచ్చేసిన కేంద్ర బృంద సభ్యులు రాజేంద్ర రత్నూ,విక్రంసింగ్ కోవూరు,సర్వేపల్లి, నెల్లూరు నియోజక వర్గాల్లోనిపలుప్రాంతాలను పరిశీలించారు.తొలుత ఇనమడుగు, లేగుంట పాడు,చెర్లోపాలెం,పల్లిపాడు,జగదేవి పేట,కొత్తూరు ప్రాంతాల్లో పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న తమలపాకు, అరటి తోటలను పరిశీలించారు. రైతులు సురేంద్ర రెడ్డి, ఆసిం, శ్రీనివాసులు రెడ్డితో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట ఏ దశలో నష్టం జరిగింది, ఎంత విస్తీర్ణం దెబ్బతినింది, ఎరువులు, పురుగుమందుల ఖర్చు, దుక్కి దున్నినప్పటి నుంచి ఇప్పటివరకు అయిన ఖర్చు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎకరా అరటి తోటకు70వేలు ఖర్చవుతుందని రైతు తెలుపగా, నమోదు చేసుకున్నారు. రైతులు తెలిపిన వివరాలను ఆసక్తిగా ఆలకించారు. జగదేవిపేటలో విద్యుత్ సబ్స్టేషన్ పరిశీలించి జరిగిన నష్టాన్ని, తీసుకున్న చర్యలను విద్యుత్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఫొటోలతో కేంద్ర బృందానికి వివరించారు. కొత్తూరులో వర్షానికి కూలిన ఇంటిని పరిశీలించి, ఇంటి యజమాని రమణమ్మతో మాట్లాడారు.తొలుత కోవూరుకు విచ్చేసిన కేంద్ర బృంద సభ్యులు రాజేంద్ర రత్నూ, విక్రమ్ సింగ్ కు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఆర్డీఓ మలోల ఘన స్వాగతం పలికారు. అనంతరం వెంకటాచలం మండలం పులతీగల పాడు వద్ద కనుపూరు కాల్వకు పడిన గండిని కేంద్ర బృందసభ్యులు పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవేణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎంఐపి పీడీ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఎస్ ఈ విజయన్, ఆర్ అండ్ బి ఎస్ ఈ గంగాధర్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిడాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి కలెక్టర్లకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.గురువారం సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి, రీసర్వే పురోగతి, జాతీయ రహదారులకు భూసేకరణ, ఏపీఎఫ్సి గోడౌన్లకు భూ కేటాయింపు, కామన్ ఫెసిలిటీ సెంటర్స్ నిర్మాణాల పురోగతి, మిచౌంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల పరిస్థితి, తీసుకోవాల్సిన చర్యలపై, జగనన్న పాల వెల్లువ ప్రగతి, చిరుధాన్యాల ప్రోత్సాహనికి తీసుకుంటున్న చర్యలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణ, ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల పురోగతి, తదితర అంశాల పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. నెల్లూరు కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, డిఆర్ఓ లవన్న, డిపిఓ సుస్మిత, డిఆర్డిఎ, డ్వామా, హౌసింగ్ పిడీలు సాంబశివా రెడ్డి, వెంకట్రావు, నాగరాజు, అర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగవర ప్రసాద్, డిసిఓసుధా భారతి, పశుసంవర్ధక శాఖ జేడిమహేశ్వరుడు, సర్వే ల్యాండ్ రికార్డ్సఎడి హనుమాన్ ప్రసాద్,తదితర అధికారులుపాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరకీ ఇళ్ళు పథకంలో పేదలకు పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఫేజ్-2 లో లక్ష్యం గా నిర్దేశించిన 5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు గాను నిర్దిష్టమైన లక్ష్యాలను రూపొందించుకొని, స్టేజ్ కన్వర్షన్ పై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జరుగుచున్న రీ సర్వే ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేంచబడిన లక్ష్యం మేరకు రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జగనన్న పాల వెల్లువ ప్రగతిని నిర్దేశించిన లక్ష్యం మేరకు సాధించాలన్నారు. జాతీయ రహదారులకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి సారించి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లాల్లో చేపట్టిన మల్టీ పర్పస్ ఫెసిలిటీ గోడౌన్ల నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, కార్యక్రమాన్ని నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వివిధ స్టేజిల్లో వున్న ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లాకలెక్టర్లకుసూచించారు.

తుఫాన్‌లో నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో అఖిలపక్ష పార్టీలు, రైతులు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: ఇటీవల సంభవించిన తుఫాన్ వల్ల జిల్లాలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని అయితే రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని అఖిలపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. గురువారం నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ తుఫాన్‌కు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణం సాయంగా 1000 కోట్లు విడుదల చేయాలని పూర్తి సహాయం కింద కేంద్ర ప్రభుత్వం పదివేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నష్ట పోయిన రైతాంగాన్ని గుర్తించటం అదేవిధంగా కౌలు రైతులకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. తుఫాను, కరువు వలన నష్టపోయిన రైతులకు కౌలు రైతులకు తక్షణం అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలని, తడిసిన ధాన్యం పత్తి మిర్చి పంటలకు ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి, ఈ క్రాప్ తో సంబంధం లేకుండా రైతులకు కౌలు రైతులకు నష్టపరిహారం అందజేయాలి అని డిమాండ్ చేస్తూ జిల్లా రెవిన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నెల్లూరు నగర కార్యదర్శి నాగేంద్ర సాయి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షాన్ వాజ్ ఆనంద్, నాగరాజు, సిరాజ్ ఏఐటీయూసీ నాయకులు ఆంజనేయులు, శంకర్ కిషోర్, జిలాని ఖాన్, సిపిఐ నగర నాయకులు నాగేంద్ర , ముక్తి యాలు రైతు సంఘం నాయకులు బలిజేపల్లి వెంకటే శ్వర్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దర్గాబాబు. సిపిఎం నాయకులు మూల రమేష్ మాదాల వెంకటేశ్వర్లు మోహన్ రావు చంద్ర రాజగోపాల్, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. తొలిత గాంధీ విగ్రహం నుండి ర్యాలీగా బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కొండ్రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సంపూర్ణ అభివృద్దే లక్ష్యంగా ఎంపీ, రూరల్ ఇంచార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 31 డివిజన్ రామ కోటయ్య నగర్ 3వ వీధిలో రూ. 31 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. నెల్లూ రు రూరల్ నియోజకవర్గంలో సంక్షేమం అభివృద్ధి రెండు కూడా సమాన ప్రాతిపదికలో ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్నాయని విజయ డైరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మిచాంగ్ తుపాన్ బాధితులకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో రూ.2500లు ప్రభుత్వ ఆర్థిక సాయం, 25 కేజీలు బియ్యం, ఒక్కొక్క కేజీ చొప్పున కందిపప్పు, ఎర్రగడ్డలో, కూర కాయలు, వంట నూనె తదితర నిత్యవసర సరుకులను అందించడంలో యంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారని విజయ డైరీ చైర్మన్ కొండ్రేడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలని, రూరల్ నియోజకవర్గం ఇంచార్జీగా బాధ్యతలు చేపట్టిన అతి తక్కువ కాలంలో రూ.125 కోట్లకు పైగా వివిధ రూపాలలో నిధులు తీసుకొచ్చి నెల్లూరు రూరల్ నియోజకవర్గంను నంబర్ -1 స్థాయిలో అభివృద్ధి చేస్తున్న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డికి ప్రజలందరూ సంపూర్ణ మద్దత్తు అందించి 2024 ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం అందించాలని విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డికోరారు.ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ ఇంచార్జీలు బోయిల్ల ఆదిరెడ్డి, ఐరెడ్డి సుబ్బారెడ్డి, టీవీఎస్ కమల్,నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, శేఖర్రెడ్డి,సురేష్, రసూల్, సీనయ్య, తన్వీరు, సతీష్, సందాని, గౌస్ బాషా, సిహెచ్ చిరంజీవి, నరసింహ రాజు, అనిల్, వెంకటేష్, రాము, చిన్న, కోటి, చంద్ర రెడ్డి, ఖాసీం, జిల్లా వైఎస్ఆర్సిపి యూత్ అధ్యక్షులు మంగళ పూడి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు పాలకుర్తి రవి కుమార్,సిహెచ్ హరిబాబు యాదవ్, ఎంబెటీ ఏసునాయుడు, వేలూరు శ్రీధర్ రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వార్డు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పునరుత్పాదక ఇంధన వనరుల వివరాలివ్వండి - తిరుపతిఎంపీ గురుమూర్తి

(మొదటి పేజీ తరువాయి)
ప్రయోజనాన్ని కలిగి ఉంటుందని తెలియజేశారు. అలాగే సౌరశక్తి, పవన శక్తి, హైడ్రో ఎనర్జీ, బయో-ఎనర్జీ, తరంగ శక్తి ద్వారా ఎనర్జీ, వేస్ట్ టు ఎనర్జీ మరియు జియోథర్మల్ ఎనర్జీ దేశంలోని అనుకూల పునరుత్పాదక ఇంధన వనరులుగా గుర్తించబడ్డాయని తెలియజేశారు. 30.11.2023 వరకు సౌరశక్తి రూపంలో 72.31 గిగావాట్స్, గాలిమరల రూపంలో 44.56 గిగావాట్స్, జలశక్తి రూపంలో 51 .86 గిగావాట్స్ బయో మాస్ రూపంలో 10.83 గిగావాట్స్ సామర్థ్యం కలిగి ఉన్నామని తెలియజేశారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం భగవాన్ వెంకయ్య స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. సినీ సెట్టింగ్లు తలపించేలా గణపతి, అయ్యప్ప స్వామి, సుబ్రమణ్యం స్వామి విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసి సుందరంగా అలంకరించారు. విద్యుత్ బల్బులను అలంకరించారు. అనంతరం అర్చకులు, అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్పస్వామి పాటలు, భజన గీతాలు పాడారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర-ఆత్మకూరు : ఆత్మకూరు మండలం వాశిలి సచివాలయాన్ని గురువారం ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు అందజేస్తూ సచివాలయ సిబ్బంది పాలన పాటించాలని, ఉదయం 10:30 లోపు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాల్నారు. అలాగే ఎవరైనా ఫీల్డ్ విజిట్ కి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా మూవ్ మెంట్ రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు స్పందన గ్రీవెన్స్ వహించాలని, జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. తదుపరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఈ రెండు కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్దపరిశీలించారు. ఎంపీడీవో వెంట ప్రధానోపాధ్యాయురాలు వసుంధర దేవి, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి షేక్ పర్వీన్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని సందర్శించిన కేంద్ర బృంద సభ్యులు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : జిల్లాలో తుఫాన్ నష్టాన్ని అంచనా వేసేందుకు విచ్చేసిన కేంద్రంలో సభ్యులు రాజేంద్ర రత్నూ, విక్రంసింగ్ పల్లిపాడు లోని మహాత్మా గాంధీ పినాకిని ఆశ్రమాన్ని సందర్శించారు. గురువారంఇందుకూరుపేట మండలం జగదేవిపేట, కొత్తూరులో తుఫాన్ నష్టాలను పరిశీలించిన కేంద్ర బృందం పల్లిపాడు లోనిగాంధీ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలో కాసేపు ధ్యానం చేశారు. గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కుర్మనాథ్,ఆర్డిఓ మలోల తదితరులున్నారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడమే లక్ష్యం

డాక్టర్ వైయస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ లు... ఏవో వి గీతా ప్రకాష్

విశాలాంధ్ర కందుకూరు రూరల్ : నాణ్యమైన విత్తనాలు ఎరువులు రైతులకి అందుబాటులో ఉంచాలనే సదుద్దేశంతోడాక్టర్ వైయస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్లు ఐ ఏ ఎల్ ఏర్పాటు చేశారనీ ఏ వో వి. గీతా ప్రకాష్ తెలిపారు.ఈ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాబ్ ల ద్వారా 4 రకాల విత్తనాలు ఎరువులు పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.) ఆర్ బి కే శాంపుల్స్: రైతు భరోసా కేంద్రాలకి సరఫరా చేసే ప్రతి విత్తనం ఎరువుల్ని మా ల్యాబ్లో టెస్ట్ చేసి రిసల్ట్ పాస్ అయితేనే (విత్తనం అయితే తగు మొలక శాతం ఎరువులయితే ఉండాల్సిన పోషక మోతాదు కరెక్ట్ గా ఉంటేనే) ఆ విత్తనం, ఎరువుని ఆర్.బి.కెల ద్వారా రైతులకి పంపిణీ చేస్తామని తద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులు పొందవచ్చని ఆమె చెప్పారు.ట్రేడ్ శాంపిల్ :ప్రైవేటు విత్తన, ఎరువుల వ్యాపారం చేస్తున్న ట్రేడర్లు మరియు డీలర్లు స్వచ్ఛందంగా తమ వద్ద ఉన్న విత్తనం లేదా ఎరువులు తెచ్చుకొని పరీక్షించు కోవచ్చని అయితే ప్రైవేటు శాంపిల్స్ కాబట్టి విత్తనానికి రూ 300/- ఎరువులకి ఒక్కో పోషకం పరీక్షించుకోవడానికి రూ 1000/- చెల్లించాల్సి వస్తుందని, ఎన్ పి కే ఎరువులు అయితే రెండు పోషకాలు కంటే ఎక్కువ కాబట్టి రూ 2500/- చెల్లించాల్సి వస్తుందనీ. ఆమె వివరించారు.ఏ సి టీ శాంపిల్స్ :- మండల వ్యవసాయ అధికారులు తీసే శాంపిల్స్ ఆర్ సి సి ల ద్వారా డి కోటింగ్ అయ్యి మా ల్యాబ్ లోకి వస్తాయని తద్వారా ఏ వో శాంపిల్ తీశారు తమకి కూడా తెలియదని అందువల్ల శాంపిల్ రిజల్ట్ కరెక్ట్ గా ఆన్లైన్ లో నమోదు చేస్తామని తెలిపారు దీనివల్ల వ్యాపారస్తులు తమ దగ్గర ఏ వోలు తీసిన శాంపిల్స్ రిజల్ట్ ని తారుమారు చేసే అవకాశాలు అస్సలు ఉండవని అందులో ల్యాబుల్ మంచిగా పని చేస్తున్నాయని ఆమె తెలియజేశారు. రైతు నమూనాలు : రైతులు కూడా తమ సొంతంగా పండించిన విత్తనాలు, లేదా బయట ప్రైవేటు వ్యాపారస్తుల దగ్గర కొన్న విత్తనాలు మరియు ఎరువులు ల్యాబ్ లో ఉచితంగా పరీక్షించుకోవచ్చు అని అన్నారు. రైతు నమూనాని నేరుగా రైతు గాని లేదా ఆర్ బి కే సిబ్బంది ద్వారా గాని ల్యాబ్ కి పంపవచ్చు నమూనాతో పాటు రైతు పేరు, గ్రామం, ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్, పంట పేరు, రకం పేరు కచ్చితంగా రాసి పంపించాలి కొన్న విత్తనం లేదా ఎరువులైన కొన్న రసీదు జిరాక్స్ కూడా పంపితే ఒకవేళ అది ఫెయిల్ అయితే సదరు డీలరుపై శాఖపరమైన చర్యలు తీసుకోవచ్చని వివరించారు. ఇప్పటివరకు 368 విత్తనాలు, 202 ఎరువులు, మొత్తం 570 పరీక్షించామని అందులో 24 శాతం నమూనాలు పెయిల్ అయ్యాయని ఆమె తెలిపారు.

మార్కెట్లోకి కొత్త కియా సోనెట్ వరల్డ్ ప్రీమియర్

విశాలాంధ్ర బ్యూరోనెల్లూరు: ప్రముఖ మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థ కియా, భారతదేశంలో మొట్టమొదటిగా అత్యధికంగా అమ్ముడవుతున్న రెండవ ఆవిష్కరణ ది న్యూ సోనెట్ యొక్క కొత్త అవతార్ను పరిచయం చేసినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది 10 స్వయంప్రతిపత్త లక్షణాలతో ఏడీఎస్ఈ ని ప్యాక్ చేస్తుందనీ, వీటిలో ఫ్రంట్ కొలిజన్ అవాయిడెన్స్ అసిస్ట్ లీడింగ్ వెహికల్ డిపార్చర్ అలర్ట్ లేన్ ఫాలోయింగ్ అసిస్ట్ ఉన్నాయన్నారు. బలమైన 15 హై-సేఫ్టీ ఫీచర్లతో కలిపి, సోనెట్ ఇప్పుడు 25 కంటే ఎక్కువ భద్రతా లక్షణాలను కలిగి ఉందనీ వివారించారు. కొత్త సోనెట్ దాని విభాగంలో 15 ప్రామాణిక భద్రతా లక్షణాలను అందించే ఏకైక కాంపాక్ట్ ఎస్‌యూవి అవుతుందనీ అశాభావం వ్యక్తం చేశారు. కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సిఈఓ తే-జిన్ పార్క్ మాట్లాడుతూ "సెల్టోస్ను అనుసరించి మా విజయవంతమైన భారత దేశ ప్రయాణంలో సోనెట్ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. అద్భుతమైన ఫీచర్లు, డిజైన్తో భారత దేశంలో ప్రదర్శించబడి, ఇది సరిహద్దులను అధిగ మించి, ఇప్పుడు 100 దేశాలకు ఎగుమతి చేయబడుతోందన్నారు. కొత్త సోనెట్ పరిచయంతో కాంపాక్ట్ ఎస్ యూ వి విభాగంలో అగ్రస్థానాన్ని పొందడం మా ఆశయమన్నారు.

పిడిఎస్‌యు 23వ రాష్ట్రజయప్రదం చేయండి: రాష్ట్ర ఉపాధ్యక్షులుసునీల్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : పిడిఎస్ యు23వ రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరుగుతున్న సందర్భంగా మహాసభలను పిడిఎస్యు, అరుణోదయ కార్యకర్తలు నెల్లూరు నగరంలో విస్తృతంగాప్రచారం నిర్వహించారుఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సునీల్ మాట్లాడుతూ భావితరం మెదడులోకి సనాతన కులధర్మం శాశ్వతమన్నే భావన మైనార్టీ సమూహాల పట్ల కృత్రిమ ద్వేషాన్ని, అజ్ఞాన విశ్వాసాలను అబద్ధాలు చరిత్రను పాలకులు పిల్లల మెద ళ్ళలోకి ఎక్కిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ మహాసభ చర్చించి నూతన కర్తవ్యాల్ని చేపట్ట బోతుందన్నారు. అలాగే జగన్ జగన్ ప్రభుత్వం 84, 85,117 జీవోలతో పాఠశాల వ్యవస్థను ముక్కలు చేసి విలీనం చేసి 4000 పాఠశాలను మూసి వేశారు. నాడు నేడు పనులు వృధా అవుతున్నాయి అనేక సంస్కరణలు కంపెనీలు ప్రయోజనాల కోసమే నిర్వహిస్తున్నారుఈ విషయాన్ని 15 16 17 తేదీల్లో జరిగే మహాసభలు చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకుంటాయని అన్నారు. ఈ సభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తిచేశారుఈప్రచారకార్యక్రమంలో పిడిఎస్సి నాయకులు సునీల్,షారుక్ బాబురావు మానస మయూరి, ధర్మ రెడ్డి భీమ్శంకర్ తదితర పాల్గొన్నారు.

అంగన్వాడి సమ్మెకు ఇంటూరి నాగేశ్వరరావు మద్దతు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: అంగన్వాడి ఉద్యోగుల ధర్నా కార్య క్రమంలో కందుకూరు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు మద్దతు తెలియ జేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ, గత 4 రోజులుగా అంగన్వాడి ఉద్యోగులు కందుకూరు తహసిల్దార్ కార్యా లయం ఎదురు సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటూరి నాగేశ్వరరావు గురువారం మధ్యాహ్నం దీక్ష శిబిరానికి వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద బలహీన వర్గాల చిన్నారులు ఎక్కువగా వెళ్లే అంగన్వాడీ కేంద్రాలలో, టీచర్లు, ఆయాలు, హెల్పర్లు చాలా చక్కగా విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. అయినప్పటికీ వారి సమస్యల పట్ల జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు పైగా ఇతర శాఖల ఉద్యోగులను కూడా వారిపై ఉసిగొలిపి రకరకాలుగా బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఇటీవల తుఫాను మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ముస్తా పురంలో పలు విద్యుత్ స్తంభాలు దెబ్బ తిన్నాయి. దీంతో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వర రావు, కౌన్సిలర్ ఎం రాజశేఖర్ లు విద్యుత్ సిబ్బందిచే గురువారం నూతన స్తంభాలను ఏర్పాటు చేయించారు. నూతన విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేశారు. స్థానికులు వెంటనే పనులు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలి

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలం లోని తెగచర్ల సచివాలయ పరిధిలో రాష్ట్రానికి జగనే ఎందుకు ము ఖ్యమంత్రి కావాలని కార్యక్రమంలో రాష్ట్రంలో వైయ స్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమం త్రి అయినతరు వాత పేద ప్రజ ల కోసం ప్రవేశపె ట్టిన సంక్షేమ పథకాలు గురించి డిస్ప్లే బోర్డు ఏర్పాటు చేసిన అనంతరం సం క్షే మ పథకాలు గురించి ప్రజల కు తెలియజే సారు. అనంతరం వైస్సార్ కాం గ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈకార్యక్ర మంలో రాపూరు మండలం వైకాపా కన్వీనర్ పా పకన్ను ద యాకర్ రెడ్డి,రాపూరుమండల జెసిఎస్ ఇంచార్జీ లక్ష్మీ నారాయ ణ రెడ్డి,వైస్ యం పీపీ పోలంరె డ్డి పెంచలరెడ్డి, ఎం పిండిఓ అ ప్పాజీ,మండల వైఎ స్ఆర్సీపి ప్రముఖులు,రాంకూరు స్థా నికు లు దు గ్గిరెడ్డి నరసింహా రెడ్డి, తెగచర్ల గ్రామ స్థానికులు బొడ్డు మధుసూధన రెడ్డి,పెనుబర్తి స్థా నికులు కొప్పుల లీలా మోహన్ రెడ్డి,ఎంపిటిసి బుజ్జిరెడ్డి,కొడ్ళ కొండయ్య,సత్తు పెంచల స్వా మి,ఉమామహేశ్వర రెడ్డి, మాద మాల శ్రీహరిరెడ్డి నాయకులు, కార్యకర్తలు, అదికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయ పునర్నిర్మాణం శుభపరిణామం : ఎమ్మెల్యే మేకపాటి

విశాలాంధ్ర-ఆత్మకూరు : తుఫాను వర్షాలతో దెబ్బతిన్న చారిత్రిక ప్రసిద్ధిగాంచిన సోమేశ్వరాలయ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావడం మా అదృష్టంగా భావిస్తున్నామని, సోమేశ్వరాలయాన్ని ఆధ్యాత్మికంగాను, పర్యాటకంగాను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమరెడ్డి అన్నారు. గురువారం సోమ శిలలోని సోమేశ్వరాలయ పునర్నిర్మాణ కార్యక్రమాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ 300 ఏళ్ల చరిత్ర కలిగిన సోమేశ్వరాలయం ఎన్నో వరదలను చూసినప్పటికి మూడేళ్ల క్రితం వచ్చిన వరదలతో ఆలయ గాలిగోపురం, అమ్మవారి దేవాలయం, నవగ్రహ మండపం కూలిపోవడంతో ఆలయ రూపురేఖలు పూర్తిగా మారిపోవడం జరిగిందన్నారు. వరదలతో దెబ్బతిన్న ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు రూ.10 కోట్లు, పర్యాటకాభివృద్ధికి రూ.25 కోట్ల వరకు ఖర్చు అవుతుందని వివరించారన్నారు. ఆలయ నిర్మాణాన్ని దశల వారీగా నిర్మాణాన్ని చేపట్టే విధంగా తొలుత రూ.1.50 కోట్లతో గాలి గోపురం నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం మ్యాచింగ్ గ్రాంట్ కింద 33 శాతం అందచేస్తే మిగిలిన నిధులు దేవాదాయశాఖ అందచేస్తుందని తెలియచేయడంతో తాము రూ.50 లక్షలు అందచేశామన్నారు. దేవాదాయశాఖ ద్వారా రూ.కోటి మంజూరు కావడం జరిగిందని వివరించారు. దీంతో ఆధ్యాత్మిక ఉట్టిపడేలా తొలుత గాలిగోపురం నిర్మాణాన్ని దేవాదాయశాఖ అధికారులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని, ఆలయ వంశపారంపర్యధర్మకర్తలు, భక్తుల మేరకు కోరిక నిర్మాణం వేగవంతంగా జరిగేలా చూడాలని దేశాదాయశాఖ అధికారులను కోరారు. అంతేకాక ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తున్న మండల వైఎస్సార్సీపీ కన్వీనర్, జడ్పీటీసీ సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు ఊరిబిండి ప్రభాకర్ రెడ్డిలకు అభినందనలు తెలియచేస్తున్నామని, అందరి సహకరాంతో ఆలయ నిర్మాణం సాగుతుందని అన్నారు. పర్యాటకాభివృద్ధి కోసం పలువురితో చర్చించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తీసుకెళ్లడం జరిగిందని, సుమారు రూ.15 కోట్లతో ప్రతిపాదనలు అందచేసినట్లు వివరించారు. సోమశిల జలాశయానికి వచ్చే పర్యాటకులకు, ఆలయానికి వచ్చే భక్తుల కోసం రూంలు, ఇతర మౌళిక వసతులు కల్పించి అభివృద్ధి చేసేలా చూస్తామని వివరించారు. పర్యాటకాభివృద్ధి చేస్తే సోమశిల మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. తొలుత కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, మండల సీనియర్ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్ ఊరిబిండి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు ఉప్పల విజయ్ కుమార్, ఉప్పల సోమసుందరరమూర్తి, జడ్పీటీసీ వీర్ల పార్థసారధి, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ ఈఈ దశరధరామిరెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అటో ఢీ..వ్యక్తి మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం: చెన్ను

విశాలాంధ్ర- రాపూరు : అటోఢీ కొన్ని ప్రమాదంలో మృతి చెంది ప్రమాదానికి గురైన వారి కుటుం బాలను పరమార్శించారు. వారి కుటుంబసభ్యులకు రాపూరు మండల ప్రముఖులు దివంగత నేత చెన్ను బాలకృష్ణా రెడ్డి జ్ఞాప కార్థం చెన్ను తిరుపాల్ రెడ్డి,చెన్ను భాస్కర్ రెడ్డిలు ఆర్థిక సాయం అందించారు. గతనెల 27వ తేదీన పని కోసం వెళ్లి అటోలో వస్తు న్న ఆటోను మరో ఆటో ఢీకొన డంతో రాపూరు హరిజనవాడలో ఇద్దరు మృతి చెందారు.ఏడు మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చెన్ను తిరుపాల్ రెడ్డి, చెన్ను భాస్కర్ రెడ్డి నల్ల వడ్లవెంకటరమణారెడ్డి,మూరం రెడ్డి(ఎంఎంటి) మధు రెడ్డి, రామచంద్రయ్య, నాయకులు పరామర్శించి చనిపోయిన కుటుంబాలకు రూ.10 వేలు, కాళ్లు చేతులు విరిగిన వారికి రూ.5000 అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

అంగన్వాడీ కార్యకర్తల వినూత్న నిరసన

విశాలాంధ్ర - ఉలవపాడు : అంగన్వాడీల ఆందోళన 3వ రోజు చేరింది.ఉలవపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద ఈరోజు అంగన్వాడీలు వినూత్నంగా మోకాళ్ళతో నిలబడి రాష్ట్ర ప్రభుత్వ చర్యలను నిరసించారు.ఈ సందర్భంగా అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు సి. హెచ్ ఇందిరావతి, ఎస్.కే పద్మజ బి.మార్తమ్మలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తుందని,రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు లొంగబోమని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు. అలాగే అంగన్వాడీలను అదిరించి, బెదిరించి ఉద్యమాన్ని ఆపాలనుకోవడం అవేకమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టుదలకు పోకుండా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడి న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉలవపాడు గుడ్లూరు లింగసముద్రం మండలాల అంగన్వాడీ యూనియన్ నాయకులు కత్తి బుజ్జమ్మ, బర్రె తిరుపతమ్మ, పి రమణి, ప్రసన్న, ఎస్ పద్మజ, సిహెచ్ పద్మజ,గీత తదితరులు పాల్గొన్నారు.

బోగోలు మండలంలో మూడవరోజు అంగన్వాడీమూత

విశాలాంధ్ర-బిట్రగుంట: రాష్ట్ర అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు బోగోలుమండలంలోని 79 అంగన్వాడీ కంద్రాలుమూడవరోజు మూతపడ్డాయి. యూనియన్ నాయకుల పిలుపుమేరకు గురువారం కావలి ప్రాజెక్టుకార్యాలయంముందుఅంగన్వాడీలు మోకాళ్లపైనిలబడివినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగోలుమండలఅంగన్వాడి నాయకురాలుపెంచలమ్మ మాట్లాడుతూ చాలీచాలనిజీతాలతోకడుపు మండిగత్యంతరంలేని పరిస్థితులలో రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని ప్రస్తుతపరిస్థితులలో తమకుఇస్తున్న 11500 జీతంతో ఒళ్ళుబలిసి రోడ్డుమీదపడ్డామని నాయకులుమాట్లాడడంసరైనది కాదన్నారు ఇకనైనాప్రభుత్వంతమ సమస్యలపట్లస్పందించితమ న్యాయమైనడిమాండ్లను నెరవేర్చాలనివారు కోరారు.

టీడీపీ సూపర్ 6 పథకాలపై ఇంటూరి ప్రచారం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : బాబు షూరిటీ - భవిష్యత్తు కుగ్యారెంటీలి కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణంలోని 6వ వార్డులో తిరుగుతూ పథకాలపై అవగాహన కల్పించిన నాగేశ్వరరావు.ఉదయం 6 గంటల నుంచే పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి, ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవడంతో పాటు.... వైసీపీ ప్రభుత్వ హయాంలో పెరిగిన ధరలు, చార్జీలు, దోపిడి, అక్రమ కేసులు గురించి వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే, మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా, పథకాలు ప్రవేశపెట్టి, చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతారని హామీతల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, రైతులకు ఆర్థిక సహాయం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు రక్షణ చట్టం పథకాలను అంకెలతో వివరిస్తూ షూరిటీ బాండ్లను అందజేశారు. జగన్మోహన్ రెడ్డి చేతకాని పరిపాలనలో రాష్ట్రం సర్వనాశనమైన సంగతిని స్థానికులకు తెలియజేస్తూ.. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ బాషా, వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

తుపాను బాధితులకు పెనుబర్తిలో బియ్యం పంపిణీ

విశాలాంధ్ర-రాపూరు: ఇటీవల కురిసిన మీచింగ్ తుపానుప్రభా వితంతో ఇబ్బందులు పడిన నిరుపేదలకోసం రాపూరు మండలంలోని పెనుబర్తి గ్రామంలో రాపూరు మండలం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పాపక న్ను దయాకర్ రెడ్డి, రాపూరు మండలం జె.సి.యస్. ఇంచార్జి దందోలు లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రేషన్ బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రాపూ రు వైస్ యంపీపీ పోలంరెడ్డి పెం చలరెడ్డి,మండల నాయకులు స్థానికులు కొప్పలలీలామోహన్ రెడ్డి, దుగ్గిరెడ్డి నరసింహ రెడ్డి, బొడ్డు రమణారెడ్డి, ఉమామ హేశ్వరరెడ్డి,మాజీ వైకాపా మం డల పార్టీ కన్వీనర్ కలపాటి మధుసూదన్ రెడ్డి,మాదమాల శ్రీహరి రెడ్డి, పెంచలస్వామి, పు ట్టంరెడ్డి కృష్ణారెడ్డి, రమణారెడ్డి, నారిబోయిన మస్తానయ్య యా దవ్, ఎలికిచర్ల అంకయ్య, మూరాంరెడ్డి రామిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

దారి దోపిడీ గొలుసు దొంగలు నలుగురి అరెస్టు..

రూ.5 లక్షల సొత్తు స్వాధీనం

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: డిసెంబర్ 14 మండల పరిధిలో గత నెల 27న హెరిటేజ్ సమీపంలో జరిగిన దారిదోపిడి గొలుసు దొంగల ఆటను వలేటివారిపాలెం పోలీసులు ఆట కట్టించి నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని అందరి అభినందనలు అందుకున్నారు ఈ కేసు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి కథనెల 27న మండల పరిధిలోని బడేవారిపాలెం గ్రామానికి చెందిన ముప్వా మాల్యాద్రి తన భార్యతో కలిసి కందుకూరు నుండి తన స్వగ్రామానికి వస్తున్న సమయంలో హెరిటేజ్ సమీపంలో రెండు మోటర్ బైక్లు పై వచ్చిన యువకులు వాటిని అడ్డగించే గాయపరిచి గొలుసు దొంగిలించినట్లు తెలిపారు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం డిఎస్పి రామచంద్రపర్యవేక్షణలో గుడ్లూరు సీఐ సుబ్బారావు ఎస్సై మహేందనాయక్ సిబ్బంది కిషోర్ మహేంద్ర పవన్ కళ్యాణ్ కాసిం వలి అప్పటినుండి ప్రత్యేక కోణంలో దర్యాప్తు చేసి నిందితులు ఈనెల 13 న అదుపులోకి తీసుకొని దొంగతనాల వివరాలు వచ్చాయి ఈ నేపథ్యంలో దొంగలించబడిన సొత్తు పొన్నలూరు మండలం వేపగుంట

గ్రామానికి చెందిన వంశీ ప్రధాన ముద్దాయిని గతంలో ఇతను పై అనేక నేరాలు ఉన్నాయని ప్రస్తుతం సింగరాయకొండలో నివాసం సింగరాయకొండకు చెందిన అడగా పవన్ కళ్యాణ్ సింగరాయకొండకే చెందిన డబ్బు కొట్టు కోటయ్య గంజి సాయి కృష్ణ నలుగురు ఒక ముఠాగా ఏర్పడి వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు వీరి నుండి సుమారు 5 లక్షల రూపాయలు సొత్తు స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా కేసులో ప్రత్యేకంగా దృష్టి సారించి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులను జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి డి.ఎస్.పి రామచంద్ర ప్రత్యేకంగా అభినందించారు.

17న ఎస్టియు టీచర్స్ సమావేశం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కందుకూరు ప్రాంతీయ ఎస్ టి యు కార్యాలయంలో ప్రాంతీయ మండలాల కన్వీనర్ పెద్దగుంట వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం గుడ్లూరు, కందుకూరు, లింగసముద్రం, వివి పాలెం మండలాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వై అశోక్ బాబు మాట్లాడుతూ 17వ తేదీ అనగా ఆదివారం ఉదయం 10 గంటలకు కందుకూరు బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగు మండలాల కౌన్సిల్ సమావేశాలు జరుగుతుందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ పి.కిష్టయ్య మాట్లాడుతూ మాట్లాడుతూ అదే రోజు నాలుగు మండలాల్లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం మరియు సమగ్ర శిక్షలో పనిచేస్తున్నటువంటి సిబ్బందికి నాలుగు నెలల నుంచి జీతాలు లేని కారణంగా తోటి ఉద్యోగులకు మానవతా దృక్పథంతో నిత్యవసర సరుకులు పంపిణీ జరుగుతుందని తెలియజేసినారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేసిన కావ్య కృష్ణారెడ్డి

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని వెంగళరావు నగర్ 18వ వార్డు జంగాల కాలనీలో ఇటీవల ఇళ్ళు కాలిపోయి కట్టుబట్టలతో నిలిచిన దుడ్డు వరలక్ష్మి కుటుంబానికి కావలి టీడీపీ నాయకులు కావ్య క్రిష్ణారెడ్డి గురువారం రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆమె నివాసానికి చేరుకొని ప్రమాద సంఘటన ను అడిగి తెలుసుకున్నారు. సుమారు రెండు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని తెలుసుకున్న క్రిష్ణారెడ్డి ఆమెకు రూ.50 వేలు ఆర్థిక సహాయం చేసి, ఆ కుటుంబానికి ధైర్యం తెలిపి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ఇంచార్జి శానం హరి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత భూమి ఆక్రమించి దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి

విశాలాంధ్ర - ఉలవపాడు :మాదిగలైన వీరమల్లు. కొండయ్య కుటుంబ సభ్యుల భూమిని ఆక్రమించి, దాడి చేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. చాకిచెర్ల రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 123/2 , 164/1లో వీరమల్లు డానియేలు, వీరమల్లు ఆదాము, కొండయ్య ల మూడెకరాల భూమిని పల్లెకారులు కుల బలంతో వీరి మోటార్లు ఎత్తుకెళ్లి పైపులు ధ్వంసం చేశారన్నారు. ఈనెల తొమ్మిదవ తేదీన పొలం శుభ్రం చేసుకుంటున్నా మాదిగలపై అప్పడి. వెంకటేశ్వర్లు ముఠా దాడి చేసి గాయపరిచారన్నారు. అయినా నేటికీ ఉలవపాడు ఎస్ఐ బాజిరెడ్డి కేసు కట్టలేదన్నారు.గురువారం స్థానిక ఉలవపాడు విషయమై మాట్లాడారు. బాధితులు ఈనెల 9వ తేదీన ఫిర్యాదు పోలీస్ స్టేషన్లో ఇచ్చిన కేసు ఎందుకు కట్టలేదన్నారు. ఫిర్యాదు కాపీని ఎస్ఐకి అందజేశామని ఎస్సై కూడా చాకిచెర్ల పల్లెపాలెం లోగల మాదిగల భూమిని పరిశీలించారన్నారు. ఇరువర్గాలను విచారించి వచ్చారన్నారు. కేసు కట్టనప్పుడు కనీసం రసీదు అయినా ఇవ్వాలి లేదా జనరల్ డైరీలోనైనా ఫిర్యాదు నమోదు చేయాల కదా అని ఉలవపాడు రైటర్ శ్రీనివాసరావును నీలం. నాగేంద్రం ప్రశ్నించారు. తమకేమీ తెలియదని ఎస్ఐ నిర్ణయం మేరకే కేసు కడతామని రైటర్ అన్నారు. ఈ సందర్భంగా ఉలవపాడు పోలీస్

స్టేషన్ ముందు నీలం. నాగేంద్ర మాట్లాడుతూ పార్లమెంట్ 2015 సవరణ చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదుల్ని ఎటువంటి విచారణ లేకుండానే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగిని కూడా ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే అరెస్టు చేయవచ్చు అన్నారు. పోలీసు అధికారులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయనప్పుడు పూర్వం సెక్షన్ 4 విధి నిర్వహణలో అలసత్వం కింద పోలీస్ అధికారులపై కేసు నమోదు చేసి చర్య తీసుకునే అధికారం ఎస్సీ ఎస్టీ కోర్టుకు ఉందన్నారు. కానీ ప్రస్తుతం సెక్షన్ 3 (2)(%జఅఅ%) ప్రకారం విక్టిమైజేషన్ ఎట్ దా హ్యాండ్సఫ్ ఏ పబ్లిక్ సర్వెంట్ ప్రకారం ఎవరైనా ఏ ప్రభుత్వ అధికారి మీదైనా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ జరిపించుకునే హక్కు ఎస్సీ ఎస్టీ బాధితులకు ఉందనీ నీలం నాగేంద్రం తెలిపారు.

నేడు పాడి రైతులకు ఉచితంగా పశు దాణా పంపిణీ

విశాలాంధ్ర -మనుబోలు : ఇటీవల వచ్చి తుపాను కారణంగా పాడి రైతులకు ఉచితంగా శుక్రవారం పశు దాణా పంపిణీ చేయనున్నట్లు స్థానిక పశు సంవర్ధక శాఖ ఏ.డి గురువా రెడ్డి తెలిపారు. మండలంలోని 14 ఆర్.బి.కె లకు ప్రభుత్వం 23 టన్నుల పశు దాణా వచ్చినట్లు వివరించారు. ఒక్కో బస్తా 25 కేజీలు ఉంటుందని, మనుబోలు పంచాయతీకి 2 టన్నుల కేటాయింపు జరిగినట్లు తెలిపారు. రైతులందురు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్వాడీలు మూసివేత ఆందోళనలో పౌష్టికాహారం

విశాలాంధ్ర-ముత్తుకూరు:చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, జీతాలు పెంచాలంటూ అంగన్వాడీ వర్కర్లు మూడు రోజులుగా కేంద్రాలను మూసివేసి సమ్మెకు వెళ్లడంతో పిల్లలకు పౌష్టికాహారం ఆందోళనకరంగా మారింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యకరంగా ఉండేందుకు వారికి పౌష్టికాహారంతో కలిగిన భోజనాన్ని మధ్యాహ్నం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించేది. ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం మెరుగైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నాయి. అయితే ఆ పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కలిగిన విద్యను, చిన్నపిల్లలకు సపరియలు చేసే అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లకు మాత్రం జీతాలు పెంచేందుకు మాత్రం ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం విచారకరంగా ఉందని అంగన్వాడీ వర్కర్లు వాపోతున్నారు.

విడవలూరులో కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నల్లపురెడ్డి.

విశాలాంధ్ర-విడవలూరు:మండల కేంద్రమైన విడవలూరులో ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ కిట్లను కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారు జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో తీర్చిదిద్దడమే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉద్దేశం అని అన్నారు.ఆడదాం ఆంధ్ర కార్యక్రమానికి 100 కోట్లు నిధులు కేటాయించారని తెలిపారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని క్రీడలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, వైయస్సార్సీపి మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్ రెడ్డి, గౌరవ కన్వీనర్ నవీన్ రెడ్డి, ఏఎంసి మాజీ చైర్మన్ పుండ్ల అచ్యుత్ రెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మండలంలోని అధికారులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మెకు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర-నెల్లూరు :నెల్లూరు ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ నిరసనను తెలియపరచారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా డీవీఎంసీ మాజీ సభ్యులు న్యాయ పోరాట పోరాట సమితి రాష్ట్ర నాయకులు కొప్పోల రఘు,నెల్లూరు జిల్లా సీపీఐ కార్యదర్శి దామా అంకయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిషోర్, ఏఐపి ఎస్సి ఎస్టి గౌరవ అధ్యక్షుడుదుడ్డు రమేష్ బాబు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. సమ్మెకు తమపార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. దుడ్డు రమేష్ బాబు మాట్లాడుతూ ఏఐజీడిఎస్యు,ఎన్యు జిడిఎస్ సంఘాల ఆధ్వర్యంలో సమ్మె కారణంగా గ్రామాల్లో తపాలా సేవలు నిలకపోయాయన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనుక ఇప్పటికయినా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మెకు ఉద్యోగు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.నవాజ్, వెంకయ్యలు తెలియజేశారు.

ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర-ఉదయగిరి: మండల పరిధిలోని గంగుల వారి చెర్లోపల్లి రామాలయం వద్ద ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా గురువారం ఉచితంగా వైద్య సేవలు అందజేశారు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఈ రథం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం గ్రామీణ ప్రజలకు ఉచితంగా అందచేస్తున్నారు. అవసరమైన వారికి ఈ రథంతో 200 రకాల రక్త పరీక్షలు ఈసీజీ కంటి పరీక్షలను అధునాతన సాంకేతతతో అనుభవాగ్నియులైన డాక్టర్లచే టెక్నీషియన్స్ నిర్వహిస్తారు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. చెర్లోపల్లి గ్రామంలో వివిధ రకాల అనారోగ్యా లకు గురైన వారిని 123 మందిని పరీక్షించి వైద్య నిపుణులు తగు సూచనలు సలహాలు ఇచ్చి ఉచితంగా మందులు అందజేశారు ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకర్ల సురేష్ను గ్రామస్తులు అభినందించారు. ప్రతి గ్రామంలో తమ ఇంటి ముంగటే వైద్య రథం వచ్చి సేవలందించడం తమకు సంతోషదాయకమన్నారు ఈ కార్యక్రమంలో కాకల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

గూగుల్ - విప్రో ఉద్యోగాలకు
ప్రకాశం విద్యార్థులు ఎంపిక : డాక్టర్ విజయ శ్రీనివాస్

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : ప్రకాశం ఇంజనీరింగ్ విద్యార్థులు మరోసారి సాంకేతిక నైపుణ్యంలో సత్తా చాటారని టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే.విజయ శ్రీనివాస్ (పూర్వ హెచ్ సి ఎల్ టెక్నికల్ మేనేజర్) హర్షం వ్యక్తం చేశారు. గూగుల్ ప్రాజెక్టుకు హైదరాబాద్ క్యాంపస్‌లో పనిచేస్తారని ఆయన చెప్పారు. విప్రో కంపెనీ (మంగళ-బుధవారం) రెండు రోజులు పాటు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఫైనలియర్ విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు. వివిధ దశలలో ఫిల్టర్ చేసి 69 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసారని విజయ్ వెల్లడించారు. ఎం.ఎన్.సి విప్రో రోల్స్ లో ఉద్యోగులు ఉంటారని, ప్రాజెక్ట్ మాత్రం గూగుల్ కంపెనీ ఆవరణంలో పని చేయవలసి ఉంటుందని ఆయన వివరించారు. పెద్ద సంఖ్యలో విప్రో- గూగుల్ కంపెనీకి ఎంపిక కావడం హర్షదాయకమని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. ఒక చేత డిగ్రీ-మరో చేత ఉద్యోగ పత్రం నినాదాన్ని కార్యరూపం దాల్చడంలో టెక్నికల్ డైరెక్టరు విజయ్ శ్రీనివాస్ కృషి శ్లాఘనీయమని ఆయన తెలిపారు. కాలేజీ అకడమిక్ ఇన్చార్జి ఎస్.యం.మీరావలి, ప్లేస్ మేంట్ ఆఫీసర్ బాలకృష్ణ, ఆయా బ్రాంచిల ఇన్ చార్జీ లు ఎస్. మాధవరావు, కే.కోటయ్య, కే. మోహన్ రావులు పర్యవేక్షించారు.

నేడు రాపూరులో టీడీపీ సమావేశం-దందోలు

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు లో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నియేజక వర్గ విస్తృత స్థాయి సమావేశం జరుగునని రాపూ రు మండల తెలుగు దేశం అ ధ్యక్షులు దందొలు వేంకటేశ్వర రెడ్డి తెలియజేసారు.ఈ సందర్భంగా దందొలు మాట్లాడుతూ ఇంఛార్జి కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 15నరాపూరు లో నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి ధులుగా తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నరసింహా యాదవ్, జన్ని రమణయ్య, గంగోడు నాగేశ్వర రావు పాల్గొంటారు.

విద్య,వైద్యం,వ్యవసాయం రంగాల్లో విప్లవాత్మక మార్పులు :మంత్రి కాకాణి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:విద్య, వైద్యం,వ్యవసాయం తదితర రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఏకైక ప్రభుత్వం తమదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి పేర్కొన్నారు. గురువారం పొదలకూరు మండలం సూరాయపాలెం గ్రామంలో 212 పేద కుటుంబాలకు ఇంటి స్థల పట్టాలను పంపిణీ చేసేకార్యక్రమంలోమంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రికాకాణి మాట్లాడుతూ గతంలో పేదలకు అలంకారప్రాయంగాఇంటిస్థలపట్టాలిచ్చేవారని,ఆయా స్థలాలు ఎక్కడ ఉన్నాయో పొజిషన్ చూపని పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేడు ప్రభుత్వ స్థలాలు లేనిచోట్ల ప్రైవేటు స్థలం కొని వారికి పట్టాలిస్తున్నామన్నారు. కేవలం పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణం సైతం చేసి ఇల్లు లేని పేదలు%శీ%డరాదనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. అదేవిధంగా సాగు భూమికి సంబంధించి ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని చుక్కల భూముల సమస్యను ఒక్క జీవో తో పరిష్కరించి సంపూర్ణ భూ హక్కులు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి.ఒక్క సర్వేపల్లినియోజకవర్గంలో 2958 కుటుంబాలకు చెందిన 4400 ఎకరాలు చుక్కల భూములు పరిష్కారమయ్యాయన్నారు. అదేవిధంగా

అసైన్మెంట్ భూములకు పట్టాలిచ్చి కమ్యూనిస్టులు తమ జీవితకాలంలోపోరాడిన పోరాటాలకు చక్కనిముగింపునిచ్చినఏకైక నేత ముఖ్యమంత్రి గారన్నారు. విద్య, వైద్య రంగాల్లో పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యాన్ని కూడా ఇంటి గుమ్మం వద్దకే తీసుకువచ్చిన ప్రభుత్వం తమదన్నారు. కేవలం సామాజిక పెన్షన్ల కోసమే 1800 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న పేదల ప్రభుత్వంతమదన్నారు.ఈ కార్యక్రమంలోఅధికారులు అనధికారులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలే ముఖ్యం : మంత్రి కాకాణి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు :రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల ప్రాణాల కంటే మరేదీ ముఖ్యం కాదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు కాకాణి గోవర్ధన రెడ్డి పేర్కొన్నారు.విద్యుత్ శాఖలో లైన్మెన్ గాపనిచేసే వెంకటాచలంమండలం నిడిగుంట పాలెం గ్రామానికి చెందిన టి. శ్రీహరి తన ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా 11 కెవి విద్యుత్ లైన్ మరమ్మత్తులు చేస్తూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణప్రాయ స్థితికిచేరిదేవునిదయతో కోలుకోవడం జరిగింది. వైద్యానికి ఖర్చుయిన మొత్తం రూ.16,59,461లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గురువారం సాయంత్రం మంత్రి క్యాంప్ కార్యాలయంలోసదరు చెక్కును భాధితునికి మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి అందించారు.

రైతును ఆదుకుంటాం :

రాష్ట్రంలో ఇటీవల మిచౌంగ్ తుఫాను కు నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు కాకాణి గోవర్ధన రెడ్డి తెలిపారు.గురువారం సాయంత్రం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల్లో రాజకీయాలు చేయడం ప్రతిపక్షాలకు తగదన్నారు. తుఫాన్లను ఒంటి చేత్తో ఆపుతామనే ప్రచార పటాటోప కార్యక్రమాలకు తాము దూరమని, ప్రాణ ఆస్తి నష్టాలను ఏ మేరకు నివారించగలమనే ఆలోచనతో పూర్తి సన్నద్ధతతో ఉన్నామన్నారు. అందుచేతనే ముఖ్యమంత్రి స్థాయిలో ఎప్పటికప్పుడు చేసిన సమీక్షలు, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం, తగు ఆదేశాలు జారీ చేయడం వంటి చర్యలతో నెల్లూరు జిల్లాలో ప్రాణ, పశు నష్టం సంభవించలేదన్నారు. అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు సీజన్ ముగిసేలోగా నష్టపరిహారం చెల్లిస్తున్నామన్నారు. 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అంది స్తున్నామన్నారు. ప్రజలను ఆదుకోవాలనే చిత్తశుద్ధి గల ప్రభుత్వం తమదని, విపత్తు నిబంధనలను సైతం సడలించి రైతులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు.

అదాని కృష్ణపట్నం పోర్టుకు గ్రీన్ టెక్ ఎన్విరాన్మెంట్ అవార్డు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : అదాని కృష్ణపట్నం పోర్టుకు 23వ గ్రీన్ టెక్ ఎన్విరాన్మెంట్ అవార్డును జమ్మూ కాశ్మీర్లో ఆదాని కృష్ణపట్నం పోర్టు ఎన్విరాన్మెంట్ హెడ్ డాక్టర్ జ్యోతికి జ్యూరీసభ్యులు ప్రధానంచేశారు. పర్యావరణ పరిరక్షణకు కాలుష్య నియంత్రణకు కృషి చేసినందుకు అదాని కృష్ణపట్నం పోర్టుకు 23వ గ్రీన్ టెక్ ఎన్విరాన్మెంట్ సంస్థ నిర్వహకులు ఈ అవార్డును అందించడం జరిగింది అదాని కృష్ణపట్నం పోర్ట్ పర్యావరణ పరిరక్షణకు కృషికి గాను గ్రీన్ టెక్ ఎన్విరాన్మెంటల్ అవార్డు రావడం ఎంతో అభినందనీయమని పోర్టు సీఈఓ జి జె రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణభద్రత తోపాటు కాలుష్య నియంత్రణకు అదాని కృష్ణపట్నం పోర్టుప్రత్యేకచర్యలుతీసుకుంటున్నట్లు ఆయనవివరించారు దీనిలో భాగంగానే అదాని కృష్ణపట్నం పోర్టుతో పాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటడం వాటి సంరక్షణ బాధ్యత చేపడుతున్నట్లు ఆయన తెలిపారు అదాని కృష్ణపట్నం పోర్టుకు గ్రీన్ టెక్ ఎన్విరాన్మెంట్ అవార్డు రావడం పట్ల పోర్ట్ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రధాన కాల్వల్లో క్రమం తప్పకుండా పూడికతీతను చేపట్టండి

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్ : భారీ వర్షాలకు రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేలా అన్ని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక కె.వి.ఆర్ పెట్రోల్ కూడలి, మాగుంట లే అవుట్, ముత్తుకూరు రోడ్డు , చిల్డ్రన్స్ పార్క్, నేషనల్ హై వే తదితర ప్రాంతాలను ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులతో కలిసి కమిషనర్ గురువారం పరిశీలించారు. నగర వ్యాప్తంగా అన్ని డివిజనుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాల్లో అంటురోగాలు వ్యాపించకుండా బ్లీచింగ్ ప్రక్రియ, దోమల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణసాధించేవరకుపోరాటంఆగదు- ఎంఆర్‌పిఎస్

విశాలాంధ్ర-బిట్రగుంట: ఎం ఆర్ పి ఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు ప్రతి మాదిగ బిడ్డ అలుపెరగని పోరాటం చేయాలని బోగోలు మండల ఎంఆర్పి ఎస్ ఇంచార్జ్ ఈమూరు మహేష్ గురువారం పిలుపునిచ్చాడు ఈనెల 18వ తేదీన నెల్లూరు అంబేద్కర్ బవనంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ శాఖలతో నిర్వహిస్తున్న సన్నాహక సమావేశానికి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ ప్రకటన చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు.

జలదంకి మండలం రైతాంగానికి తీపి కబురు
జనవరిలో చెరువులన్నింటికీ సోమశిల జలాలు

విశాలాంధ్ర-జలదంకి: జలదంకి మండలం రైతాంగానికి ఉదయగిరి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి తీపి కబురు చెప్పారు. కావలి కాలువ ద్వారా జలదంకి మండలంలోని చెరువుల న్నింటికీ జనవరి నెలలో సాగునీరు అందిస్తామని అన్నారు. ఇప్పటికే చెరువుల కింద రైతన్నలు వరి సాగు చేశారని, ఈ విషయాన్ని గురువారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కావలి కాల్వ క్రింద కొంతవరకే సాగునీరు ఇస్తున్నారని జలదంకి మండల రైతాంగానికి కూడా సాగునీరు ఇవ్వాలని మంత్రి వద్ద మేకపాటి పట్టుబట్టారు. చెరువులలో దాదాపు 70 శాతం మేర సాగునీరు ఉందని నాట్లు వేసుకున్న తర్వాత ఒకటి రెండు తడులు ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు తనకు చెప్పిన విషయాన్ని మంత్రి దృష్టికి మేకపాటి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సోమశిల ఎస్ ఈ కి ఆదేశాలు జారీ చేశారు. జలదంకి మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, తదితరులతో కలిసి ఎస్ ఈ రమణా రెడ్డిని కలిశారు. జనవరి నెలలో చెరువులకు నీరు ఇస్తామని ఎస్ ఈ హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో యువ నేత మేకపాటి అభినవ రెడ్డి, వేములపాడు సర్పంచ్ బోడిమల్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోచరిత్ర..... సోమశిల జలాశయంలో తక్కువ నీరు ఉన్నా కూడా జలదంకి మండలం రైతాంగానికి నీరు వచ్చేందుకు కృషిచేసిన మేకపాటి రాజగోపాల్ రెడ్డి చరిత్రను సృష్టించారని జలదంకి వైసీపీ కన్వీనర్ పాలవల్లి మాల కొండారెడ్డి స్పష్టం చేశారు. ఎన్నో ప్రభుత్వాలను చూసామని, ఇలాంటి పరిస్థితులు ఏర్పడిన సమయంలో

అధికార పార్టీలో పలువురు ఎమ్మెల్యేలు ఉండి కూడా జలదంకి మండలం రైతాంగం తరపున పోరాడి సాగునీరు అందించిన చరిత్ర లేదన్నారు. కొందరు ఎమ్మెల్యేల హయాంలో కావలి కాలువ పరిధిలోని ఎస్వీ పాలెం మేజర్ వరకు ఒకసారి, చిన్న క్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు ఒకసారి సాగునీరు ఇచ్చారు తప్ప పూర్తి జలదంకి మండలం రైతాంగానికి సాగునీరు అందించిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గ ఇన్చార్జిగానే మేకపాటి రాజగోపాల్ అన్న జలదంకి మండల రైతాంగం కోసం ఇంత కష్టపడ్డారని, ఎమ్మెల్యేగా ఎన్నికైతే జలదంకి మండల రైతాంగం కి ఎలాంటి కష్టం ఉండదని పాలవల్లి మాలకొండ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మేకపాటి రాజగోపాల్ రెడ్డికి జలదంకి మండలం రైతాంగం తరపున మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.